సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 3 । జులై । 2025



అస్థిర పాలనలో తప్పటడుగు..!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటింది. ఈ సందర్భంగా ఇంటింటికీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. -8లో



మహిళపై అత్యాచారం

గుడిపాడుకు చెందిన ఓ అవివాహితను మాయమాటలతో అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.2/27.0

జిల్లాలో బుధవారం 27.0 – 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 18.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఏ.ఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప అర్బన్: కడప పోలీసు కళాజాగృతి బృందం సభ్యులలో మహిళా డ్యాన్సర్‌పై అసభ్యంగా ప్రవర్తించిన ఏ.ఆర్ కానిస్టేబుల్ ఉత్తమ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై అసభ్యంగా ప్రవర్తించాడని బాధితురాలు ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఎస్పీ ప్రాథమిక విచారణ చేయించారు. విచారణలో కానిస్టేబుల్ ఉత్తమ్ కుమార్ తప్పు చేశాడనీ రుజువు కావడంతో అతనిపై వేటు వేశారు.

నియామక పత్రాలు అందజేత



రవికుమార్‌కు నియామక పత్రాలను అందజేస్తున్న పోలింగ్ ఆఫీసర్ రాధాకృష్ణయ్య

కడప కోటిరెడ్డిసర్కిల్: రైల్వే ఇన్‌స్టిట్యూట్ భవన్ ఎన్నికలు వారం రోజుల కిందట ఏకగ్రీవంగా ముగిశాయి. ఇందుకు సంబంధించిన నియామక పత్రాలను బుధవారం రైల్వే పోలింగ్ ఆఫీసర్ రాధాకృష్ణయ్య, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ గంగాదేవి ఎన్నికైన వారికి అందజేశారు. ఈ సందర్భంగా రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీగా రవికుమార్, సంయుక్త కార్యదర్శిగా నరేష్‌కుమార్, కోశాధికారిగా వెంకటేశ్వరరెడ్డి, ఆపరేటింగ్ కమిటీ సభ్యులుగా లక్ష్మినారాయణ, చినబాబు, ఎలక్ట్రికల్ కమర్షియల్ ఇంజనీరింగ్ ఎస్అండ్‌టీ కమిటీ సభ్యులుగా రాజేష్‌కుమార్, గీత, అనిల్‌కుమార్, మస్తాన్‌లకు నియామక పత్రాలను అందజేశారు.

సహకార సంఘాలు అభివృద్ధికి సహకరించాలి

కడప అగ్రికల్చర్: జిల్లాలో సహకార సంఘాల భవిష్యత్తు ప్రణాళికలను రచించి ఆదాయ మార్గాలను పెంచుకోవడానికి సిబ్బంది సహకరించాలని జిల్లా సహకార శాఖాధికారి యం. వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా బుధవారం కడప డివిజనల్ కో–ఆపరేటివ్ ఆఫీస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాలు సక్రమంగా పనిచేయడానికి కృషి చేయాలన్నారు. ప్రొద్దుటూరు సీటీసీ ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస రావు మాట్లాడారు. అనంతరం సహకార శిక్షణా కేంద్రం ప్రొద్దుటూరులో 10వ బ్యాచ్ డీసీఎం, సీపీ విద్యార్థుల సర్టిఫికెట్లు తనిఖీ చేసి వారిని కోర్సులో నమోదు చేసుకున్నారు.. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్స్ పుష్పలత, కృష్ణ రెడ్డి, నాగరత్నం, సత్యనందం, వెంకట రమణ, శ్రీధర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజన్ ప్లాన్ అమలుపై దృష్టి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో అభివృద్ధి విజన్ ప్లాన్ అమలుపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్‌లో స్వర్ణ ఆంధ్ర విజన్- 2047 లో భాగంగా జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌పై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి నియోజకవర్గ స్పెషల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వర్చువల్ విధానంలో సమీక్షించారు. జిల్లా, నియోజకవర్గ, మండలాల అభివృద్ధి విజన్ ప్లాన్‌పై ప్రతి ఒక్క నియోజకవర్గ స్పెషల్ అధికారులు,మండల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో విజయవంతమైన వారు ఇతరులకు సహకారాన్ని అందించడం,నాలెడ్జ్ షేరింగ్ లాంటి అంశాలు పీ4 పాలసీలో ఇమిడి ఉన్నాయన్నారు. అలాగే ప్రతి గ్రామం, మండలాలలో మార్గదర్శులను గుర్తించే చర్యలను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 76 వేలకు పైగా బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. అన్ని మండలాలలో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించాలని ఆదేశించారు.

బీఈడీ పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, సీఈ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ బీఈడీ కళాశాలల రెండో సెమిస్టర్ పరీక్షలు బుధవారం జిల్లావ్యాప్తంగా 16 కేంద్రాలలో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె. ఎస్ వి కృష్ణారావుతో కలిసి తనిఖీ చేశారు. కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాల, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను, వసతులను పరిశీలించారు. 4,551 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు వారు తెలిపారు. విశ్వవిద్యాలయం నుంచి ప్రతి కేంద్రానికి అబ్జర్వర్లను పంపామని, ప్రత్యేకంగా హై పవర్ కమిటీ పరీక్షలను పర్యవేక్షిస్తుందని తెలిపారు.

నిజాయితీకి.. బదిలీ బహుమానం!

- ఉపాధ్యాయ బదిలీల కౌన్సెలింగ్ నిబద్ధతతో నిర్వహించిన డీఈఓ
- యూనియన్ నేతల అడ్డగోలు సిఫార్సును పరిగణలోకి తీసుకొని వైనం
- నిక్కచ్చిగా వ్యవహరించిన డీఈఓపై కత్తిగట్టిన ఉపాధ్యాయ సంఘ నేతలు
- నేడో, రేపో బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం





షంషుద్దీన్, డీఈఓ

సాక్షి ప్రతినిధి, కడప: కూటమి ప్రభుత్వంలో విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించే అధికారులకు ప్రోత్సాహం ఏమో కానీ.. అవమానాలు.. బదిలీ బహుమానాలు దక్కుతున్నాయి. ప్రస్తుత డీఈఓ షంషుద్దీన్ విషయంలో అచ్చం ఇదే జరుగుతోంది. అనతికాలంలోనే డీఈఓ సీటు వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది. అందుకు ప్రధాన కారణం ఉపాధ్యాయ బదిలీ కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహించడమే. పైగా యూనియన్ నేతల అడ్డగోలు సిఫార్సులకు వంత పాడకపోవడంతో పాటు.. కడప ఎంఈఓ కార్యాలయం అడ్డగోలు వ్యవహారంపై చర్యలకు ఉపక్రమించడం కూడా మరో కారణంగా తెలుస్తోంది. దీంతో ఆయా సంఘాల నేతలు పొరుగు జిల్లాకు చెందిన ఓ మంత్రి ద్వారా డీఈఓ బదిలీ చేయించేందుకు శరవేగంగా పావులు కదుపుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

- కడప డీఈఓగా ఎస్.షంషుద్దీన్ ఈ ఏడాది జనవరిలో బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి విద్యాశాఖలో నెలకొన్న వ్యవహారాలను ఒక్కొక్కటిగా చక్కదిద్దుకుంటూ, ఉపాధ్యాయ సంఘాల పరస్పర అవగాహనతో సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈక్రమంలో ఇటీవల ఉపాధ్యాయ బదిలీ కౌన్సెలింగ్‌లోనూ నిబద్ధతగా వ్యవహరించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రతిపాదనలు నిబంధనల మేరకు సర్దుబాటు చేశారు. కాగా నిబంధనలు అతిక్రమించి చేసిన సిఫార్సులను తిరస్కరించారు. ఈక్రమంలో కొందరు పరుషంగా వ్యాఖ్యలు చేసినా నిబంధనలు ఇవి.. వీటిని అతిక్రమించలేమంటూ ఖరాఖండీగా చెప్పినట్లు సమాచారం.
- ఓ యూనియన్ నాయకుడు ఒకే చోట 8ఏళ్లుగా పనిచేస్తున్నారు. అక్కడ నుంచి బదిలీపై వెళ్లాల్సి ఉంది. ఈక్రమంలో మెడికల్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేశారు. మెడికల్ బోర్డు సర్టిపై చేయాల్సిన అవసరాన్ని డీఈఓ వెల్లడించినట్లు సమాచారం. అదే నేత మరో టీచర్ విషయంలో భార్య భర్తల నిబంధనలు చూపెట్టి ఫలానా పాఠశాల ఆ టీచర్‌కే ఇవ్వాలంటూ ఒత్తిడి చేసినట్లు సమాచారం. నిబంధనలు ప్రకారం భార్య భర్తలకు దగ్గరలో ఉన్న పాఠశాలలకు ఉంటుందని డీఈఓ వివరించినట్లు తెలుస్తోంది. అంతే ఆ యూనియన్ నేత డీఈఓపై కత్తి కట్టినట్లు సమాచారం.

ఎంఈఓ కార్యాలయం గాడిలో పెట్టాలని..

కడప ఎంఈఓ కార్యాలయంపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందులో ప్రధానంగా ఉపాధ్యాయులు సర్వీస్ రిజిస్టర్లు (ఎస్ఆర్) కార్యాలయంలో కాకుండా ఓ ఉపాధ్యాయుని ఇంట్లో ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. సర్వీసు రిజిస్టర్ అనేది వృత్తికి చెందిన లైఫ్, దానిని కూడా జాగ్రత్త పర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఉపాధ్యాయులు డీఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ విషయమై డీఈఓ విచారణకు వెళ్లగా కార్యాలయంలో ఉండాల్సిన సర్వీసు రిజిష్టర్లు లేవు, ఎక్కడున్నాయని ఎంఈఓను నిలదీస్తే, ఫలానా టీచర్ ఇంట్లో ఉన్నాయని వెల్లడించారు. అదే విషయాన్ని ఎంఈఓ రాతపూర్వకంగా కూడా రాయించాడు. ఎంఈఓ కార్యాలయ దుస్థితిని డీఈఓ ఆర్జేడికి వివరిస్తూ లేఖ రాశారు. ఆర్జేడి నాలుగురోజుల్లో ఎస్ఆర్‌లు అందరివీ అందుబాటులో ఉంచాలని ఉత్తర్వులిచ్చారు.

చక్రం తిప్పుతున్న గత డీఈఓ

కడప డీఈఓగా ఇదివరకూ పనిచేసిన వెళ్లిన ఓ మహిళాధికారి ఆ పోస్టులోకి తిరిగి వచ్చేందుకు చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. కొంతమంది యూనియన్ నేతలు ఆర్థిక సహకారం అందిస్తుండడంతో నంద్యాల జిల్లాకు చెందిన ఓ మంత్రి ద్వారా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఆ మేరకు నేడో, రేపో ఉత్తర్వులు వెలుబడే అవకాశం ఉందని విద్యాశాఖలో గుసగుసలు విన్పిస్తున్నాయి. అక్రమార్కులైన టీచర్లకు డీఈఓ షంషుద్దీన్ కంటగింపుగా మారడంతో ఆయన్ను బదిలీ చేసేందుకు..తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు లక్షలాది రూపాయాలు మంచి నీళ్లులాగా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.

అప్పుడేమో అలా.. ఇప్పుడేమో ఇలా..

ఆర్జేడీ కార్యాలయ అధికారుల్లోనూ ద్వంద్వ నీతి బహిర్గమవుతోంది. కొన్ని రోజుల క్రితం చింతకొమ్మదిన్నె ఎంఈఓ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారని సంజాయిషీ కూడా తీసుకోకుండా ఏకంగా సస్పెన్షన్ చేసిన ఆర్జేడీ కార్యాలయం, టీచర్లు సర్వీసు రిజిస్ట్రర్లు అందుబాటులో లేకున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కాగా, డీఈఓ షంషుద్దీన్ నిక్కచ్చితత్వంతో వ్యవహరించిన నేరానికి బదిలీ చేయాల్సిందేనని కొందరు ఉపాధ్యాయులు పట్టుబట్టినట్లు సమాచారం.

సామాన్య ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటారు



అనేక మండలాల్లో ఎంఈఓ కార్యాలయంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. అక్కడికి వెళ్లడానికి ఉపాధ్యాయులు జంకే పరిస్థితి ఉంది. అలాంటిది ఆరునెలలుగా సామాన్య ఉపాధ్యాయులకు కూడా డీఈఓ షంషుద్దీన్ అందుబాటులో ఉన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారంలో చొరవ చూపెట్టారు. బదిలీల ప్రక్రియలో అవినీతికి ఆస్కారం లేకుండా నిర్వహించారు. యూనియన్ నేతల్ని కూడా గౌరవించారు. ఎస్టీయూ డీఈఓ చర్యలను అభినందిస్తోంది.
– ఎస్ సంగమేశ్వరరెడ్డి, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు



డీఈఓ తక్కువ కాలంలో విద్యాశాఖను గాడిలో పెట్టారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. నిక్కచ్చిగా వ్యవహరిస్తూ నిబంధనలను అనుసరించారు. నిజాయితీ అధికారులను అటు సమాజం, ఇటు ప్రభుత్వం ప్రోత్సహించాలి. ప్రభుత్వానికి బదిలీ చేయాలనే ఆలోచన ఉంటే విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.
–ఎం విజయ్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఇద్దరు ఎంఈఓలు.. ఉపాధ్యాయుడికి షోకాజ్

కడప ఎడ్యుకేషన్: ఇటీవల విద్యాశాఖ చేపట్టిన ఎస్‌జీటీ బదిలీల మ్యాన్యువల్ కౌన్సెలింగ్‌లో బదిలీచట్టం –2025లోని నిబంధలను ఉల్లంఘించినందుకు కడప ఎంఈఓ గంగిరెడ్డి, ప్రొద్దుటూరు ఎంఈఓ సావిత్రిలకు షోకాష్ నోటీలను ఇచ్చినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. దీంతోపాటు కడప, ప్రొద్దుటూరు ఎంఈఓల కార్యాలయాలకు సంబంధించిన డేటాను సబ్మిట్ చేసే విషయంలో కూడా అలసత్వం ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. దీంతోపాటు కడప మండల పరిధిలోని పలువురు ఉపాధ్యాయులకు సంబంధించిన ఎస్ఆర్‌లను కడప ఎంఈఓ కార్యాలయంలో కాకుండా కడపకు చెందిన శివారెడ్డి అనే టీచర్ తమ ఇంట్లో పెట్టుకున్నందుకు ఆయనకు కూడా షోకాజ్ నోటీసులను ఇచ్చినట్లు అందులో వివరించారు.

నేడు ప్రైవేటు విద్యాసంస్థల బంద్

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్రంలోని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్సీ, సాయిబాబా విద్యా సంస్థల చైర్మన్ రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై అధికారుల వేధింపులు అధికమయ్యాయన్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి తెలిపేందుకు గురువారం విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో లక్షలాది మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 55 శాతం విద్యార్థులకు ప్రైవేటు విద్యా సంస్థలు విద్యాబుద్ధులు నేర్పుతున్నాయన్నారు. ఇందుకు సంబంధించి 4 లక్షలకు పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు. పేద వర్గాలకు సంబంధించి 25 శాతం పిల్లలకు ఉచితంగా చదువు చెప్పాలని కేంద్ర ప్రభుత్వ యాక్టు ఉన్నా అందులోని నిబంధనలు పూర్తి స్థాయిలో అధికారులు పాటించడం లేదన్నారు. ఆయా విద్యార్థులకు సంబంధించి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి 90 వేల రూపాయల వరకు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, అందులో సగం ఇవ్వాలని తాము కోరుతున్నామన్నారు. అయితే ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ యాక్టు అనేకచోట్ల దుర్వినియోగమవుతోందన్నారు. ఇలా అనేక సమస్యలతో నిర్వహిస్తున్న బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల యాజమాన్యాలు గంగయ్య యాదవ్, శివశంకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఇలియాస్ రెడ్డి, మైథిలి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వరం.. గురుకులం

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
- మహా గురుకుల విద్యాలయంలో తరగతుల ప్రారంభోత్సవం



మహాగురుకులం తరగతులను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం: నాణ్యమైన విద్య, అధునాతన వసతులతో రూపుదిద్దుకున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ (బాలుర) మహా గురుకులం విద్యాలయం పేద విద్యార్థుల పాలిట వరం అని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. బుధవారం బి.మఠం మండలంలో నూతనంగా ఏర్పాటైన మహా గురుకులం (బాలుర) విద్యాలయంలో అకడమిక్ భవనాల్లో తరగతులు, వసతి గృహ భవనాలను కలెక్టర్, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఎస్పీ ఈజీ అశోక్ కుమార్‌లతో కలిసి ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బి.మఠం మండల కేంద్రానికి సమీపంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో గురుకులం రూపుదిద్దుకుందన్నారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు విద్యా వసతులు కల్పించగల సామర్థ్యం ఉన్న ఈ బాలుర మహా గురుకులంలో.. ఈ విద్యా సంవత్సరానికి గాను 640 మంది విద్యార్థులతో అడ్మిషన్లను ప్రారంభించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఈ మహా గురుకులం కీర్తి రాష్ట్ర స్థాయిలో రెపరెపలాడించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ 21 కోట్ల వ్యయంతో మహా గురుకులం నిర్మాణం పనులు చేపట్టడం జరిగిందన్నారు. మైదుకురు నియోజకవర్గ అభివృద్ధి కోసం కలెక్టర్ ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో అన్నింటికీ మూలం ఒక్క విద్యనే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలన్నారు. గురుకుల విద్యాలయాల జిల్లా కో ఆర్డినేటర్ ఉషశ్రీ మాట్లాడారు. అనంతరం అధికారులు తరగతి , హాస్టల్ గదులు.. వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, డీఈవో షంషుద్దీన్, ఎస్ఎస్ఏ ఏపీసీ నిత్యానందరాజు,సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, డ్వామా పీడీ ఆది శేషారెడ్డి, ఎంపీపీ వీర నారాయణరెడ్డి పాల్గొన్నారు.

● 'కరెంట్' టాపిక్..

సీమకు నీళ్లివ్వండి బాబూ!

- శ్రీశైలంలో విద్యుత్ ఉత్పాదన... రైతుల్లో గుబులు
- సీమ ప్రాజెక్టులకు నీటి విడుదలపై నీలి నీడలు!
- కూటమి ఎమ్మెల్యేలపై సర్వత్రా విమర్శలు



కడప సెవెన్‌రోడ్స్: శ్రీశైలం జలాశయం నుంచి రాయలసీమ ప్రాజెక్టులకు నీటి విడుదలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే పలు రిజర్వాయర్లు బోసిపోయినట్లు అగుపిస్తున్నాయి. వరద ప్రవాహం బాగా ఉన్నప్పుడు నీరు విడుదల చేయడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించిందంటూ రైతులు మండిపడుతున్నారు. ప్రాజెక్టుల పరిధిలోని ఎమ్మెల్యేలంతా అధికార టీడీపీకి చెందిన వారైనప్పటికీ పట్టించుకోలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. తాజాగా శ్రీశైలం జలాశయం కుడి, ఎడమ గట్టు వద్ద విద్యుత్ ఉత్పాదన ప్రారంభించారు. ఆ మేరకు నీరు దిగువనున్న నాగార్జున సాగర్ జలాశయానికి వెళుతోంది. దీంతో శ్రీశైలానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రభావం ఒక్కసారిగా గణనీయంగా తగ్గుముఖం పట్టింది. సీమకు నీటి విడుదలపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ప్రకటన వెలువడని నేపథ్యంలో బుధవారం రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు కర్నూలులోని చీఫ్ ఇంజనీరు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు.

- ఇన్నాళ్లూ ఎగువన కురిసిన వర్షాల వల్ల శ్రీశైలానికి వరద ప్రభావం భారీగా వచ్చి చేరడం, విద్యుత్ ఉత్పాదన చేపట్టకపోవడం వంటి కారణాలతో శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 874 అడుగులకు చేరడంతో రాయలసీమ రైతుల్లో ఆశలు మొలకెత్తాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఈ ఏడు ప్రాజెక్టుల ద్వారా నీరందితే సకాలంలో పంటలు సాగు చేసుకోవడానికి వీలవుతుందని భావించారు. శ్రీశైలం జలాశయంలో మంగళవారం విద్యుత్ ఉత్పాదన ప్రారంభం కావడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి ఉన్న సమాచారం మేరకు.. రాష్ట్ర ప్రభుత్వం కుడిగట్టు కాలువ వద్ద విద్యుత్ ఉత్పాదన ద్వారా 27,708 క్యూసెక్కుల నీరు దిగువనున్న కృష్ణానదిలోకి వదులుతోంది. ఎడమ గట్టు కాలువ వద్ద తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పాదన ద్వారా 35,315 క్యూసెక్కులు దిగువనున్న నాగార్జున సాగర్ జలాశయంలోకి విడుదల చేస్తోంది. ఇలా శ్రీశైలం జలాశయం రెండు వైపుల నుంచి 63,023 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతోంది. బుధవారం జలాశయంలోకి వస్తున్న వరద ప్రవాహం 64097 క్యూసెక్కులుగా నమోదైంది. విద్యుత్ ఉత్పాదన వల్ల కొంత నీరు పోయినా ఇన్‌ఫ్లో ద్వారా 1074 క్యూసెక్కుల నీరు మిగులు ఉన్నట్లే కదా అని ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు. అయితే వరద ప్రవాహం స్థిరంగా ఉండదనే విషయాన్ని విస్మరిస్తున్నారు. అధికార గణాంకాల ప్రకారమే సోమవారం సుమారు లక్షా 50 వేల క్యూసెక్కులు ఉన్న శ్రీశైలం ఇన్‌ఫ్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి 64,097 క్యూసెక్కులకు పడిపోయింది. మధ్యాహ్నం 3.00 గంటల సమయానికి శ్రీశైలం నీటిమట్టం 875.40 అడుగులుగా ఉంది. ప్రస్తుతం డ్యాంలో 165 టీఎంసీలు ఉన్నాయి.
- తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలిగోడు రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 16.95 టీఎంసీలకుగాను ప్రస్తుతం 1.83 టీఎంసీ మాత్రమే ఉన్నాయి. ఈ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోవాలంటే ఇంకా 15.12 టీఎంసీల నీరు రావాల్సి ఉంది. కానీ, ఇన్‌ఫ్లో జీరోగా ఉంది. ఔట్‌ఫ్లో 80 క్యూసెక్కులు ఉంది. బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 17.74 టీంఎసీలు కాగా, ప్రస్తుతం 6.24 టీఎంసీ(35.17 శాతం) ఉన్నాయి. ఇన్‌ఫ్లో జీరో..అవుట్ ఫ్లో 132 క్యూసెక్కులు ఉన్నాయి.
- గోరకల్లు రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 12.44 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.13 టీఎంసీ (25.16 శాతం) ఉన్నాయి. ఇన్‌ఫ్లో జీరో, అవుట్ ఫ్లో 70 క్యూసెక్కులు ఉన్నాయి. అవుకు కాంప్లెక్స్ రిజర్వాయర్ సామర్థ్యం 4.15 టీఎంసీకిగాను ప్రస్తుతం 1.68 టీఎంసీ (40.53 శాతం) ఉన్నాయి. గండికోట సామర్థ్యం 26.85 టీంఎసీకిగాను ప్రస్తుతం 14.77 టీఎంసీ (54.99 శాతం) ఉన్నాయి. ఇన్‌ఫ్లో 0, అవుట్‌ఫ్లో 470 క్యూసెక్కులు. మైలవరం సామర్థ్యం 9.98 టీఎంసీకిగాను 2.57 టీఎంసీ గా ఉండగా, ఇన్‌ఫ్లో 0, అవుట్ ఫ్లో 131 క్యూసెక్కులు. పైడిపాలెం సామర్థ్యం 6 టీఎంసీలకుగాను ప్రస్తుతం 4.46 టీఎంసీ ఉన్నాయి. ఇన్‌ఫ్లో 0, అవుట్‌ఫ్లో 10 క్యూసెక్కులుగా ఉంది. సర్వరాయ సాగర్ సామర్థ్యం 3.06 టీఎంసీకిగాను ప్రస్తుతం 0.89 టీఎంసీలు ఉండగా, ఇన్‌ఫ్లో 70, అవుట్ ఫ్లో 48 క్యూసెక్కులు ఉన్నాయి.

నోరు మెదపని ప్రజాప్రతినిధులు


తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, గాలేరు–నగరి, కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలోని శ్రీశైలం, నందికొట్కూరు, నంద్యాల, పాణ్యం, బనగానపల్లె, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ్యులందరూ అధికార కూటమికి చెందిన వారే. వీరిలో ఒకరు బీజేపీకి చెందిన వారు కాగా, మిగతా వారంతా తెలుగుదేశం పార్టీకి చెందిన వారు. ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా తెలుగుదేశం పార్టీకి రాయలసీమ జిల్లాల్లో ప్రజలు మెజార్టీని కట్టబెట్టారు. అయితే, ఈ ప్రాంత సాగునీటి విషయంపై వారు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఆయకట్టు రైతుల్లో వినిపిస్తున్నాయి. వరద ప్రభావం బాగా వస్తున్న రోజుల్లోనే పోతిరెడ్డిపాడు ద్వారా జలాశయాలను నింపేందుకు చర్యలు తీసుకుని ఉండాల్సిందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం విద్యుత్ ఉత్పాదన ద్వారా నీటిని సాగర్‌కు విడుదల చేస్తూపోతే తమ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి ఇప్పటికైనా కూటమి ఎమ్మెల్యేలు స్పందిస్తారో లేదో చూడాలి.

కూటమి నేతల నిర్లక్ష్యం



రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు పోతిరెడ్డిపాడు శ్రీశైలం జలాలను విడుదల చేసే విషయంలో సీమకు చెందిన కూటమి నేతలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు విద్యుత ఉత్పాదన చేపట్టారు. వరద ప్రభావం కూడా బాగా తగ్గుముఖం పట్టింది. ఇందువల్ల శ్రీశైలంలో నీటి మట్టం క్రమేపీ తగ్గిపోతే కేసీ కెనాల్, ఎస్ఆర్‌బీసీ, జీఎన్ఎస్ఎస్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది.
–సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు, కడప

కనీస నీటిమట్టం నిర్వహించాలి



శ్రీశైలం జలాశయంలో కనీస నీటిమట్టం 854 అడుగులను నిర్వహించాలి. ఆపై వచ్చే వరద ప్రవాహాన్ని అనుసరించి రాయలసీమ ప్రాజెక్టులైన తెలుగుగంగ, కేసీ కెనాల్, ఎస్ఆర్‌బీసీలకు సాగునీరు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలి. ఇప్పుడు ఇరు రాష్ట్రాలు శ్రీశైలంలో విద్యుత్ ఉత్పాదన చేపట్టడం ఆందోళన కలిగిస్తోంది. రాయలసీమ నీటి విడుదలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలి.
– దస్తగిరిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతుసంఘం,కడప

క్లుప్తంగా

ఒకే గదిలో ఐదు తరగతులు



అన్ని తరగతుల విద్యార్థులకు విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయుడు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామంలో 1 నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల ఉంది. అయితే ఈ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకే గది ఉండటంతో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు అదే గదిలో ఒకే ఉపాధ్యాయుడు బోధిస్తున్నాడు. పాఠశాలలో అన్ని తరగతులకు కలిపి 25మంది విద్యార్థులు ఉన్నారు. ఏకైక ఉపాధ్యాయుడు ఉండటంతో విద్యార్థులకు చదువులు చెప్పేందుకు ఇబ్బందికరంగా ఉంది. అలాగే పాఠశాల భవనాలు కూడా వర్షం వచ్చినప్పుడు వర్షపునీరు గదుల్లోకి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరో ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గండి టెండర్లు .. కొన్నింటికే ఆమోదం

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో శ్రావణమాస ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి బుధవారం నిర్వహించిన టెండర్లలో అధికారులు కొన్నింటిని మాత్రం ఆమోదించి మరి కొన్నింటిని తిరస్కరించారు. ఉత్సవాలకు సంబంధించి ఫోటో, వీడియో కవరేజి, ప్రత్యేక భజంత్రీలు, స్వాగత ఆర్చీలకు సంబంధించిన టెండర్లకు ఆమోదం తెలిపినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. ప్రత్యేక పూల అలంకరణ, విద్యుద్దీపాలంకరణకు సంబంధించి ఎవరూ టెండర్లలో పాల్గొన లేదని ఆయన తెలిపారు. పందిళ్లు, బారికేడ్లకు సంబంధించి ఇద్దరు మాత్రమే వచ్చి ఒకే ధరను కోట్ చేయడంతో వాటిని తిరస్కరించామన్నారు. టెండర్ల కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, కడప దేవదాయ శాఖ సూపరింటెండెంట్ రమణమ్మ, ఆలయ ప్రధాన ఉప ప్రధాన అర్చకులు కేసరి, రాజా రమేష్, మాజీ చైర్మన్లు కావలి వీరభాస్కరుడు, కల్లూరు వెంకట స్వామి, ఆలయ సూపరింటెండెంట్ సుభాష్, ఆర్కే వ్యాలీ పోలీసులు పాల్గొన్నారు.

8 తులాల బంగారం, రూ.30 వేలు చోరీ

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలో రోడ్డు నంబర్ 10వ వీధిలో గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి ఓ ఇంటిలో 8 తులాల బంగారు, రూ. 30 వేల నగదును చోరీ చేశారు. బాధితుడు మోదుగుల నరసింహులు వివరాల మేరకు.. మాధవరం -1 గ్రామంలో ఉన్న తన తండ్రి నరసింహులు(68) ఆదివారం ఉదయం మృతి చెందాడన్నారు. తన తండ్రి మృతదేహాన్ని తన భార్య లక్ష్మీప్రసన్న పొత్తప్పి గ్రామానికి తీసుకెళ్లిందన్నారు. తండ్రి మరణ వార్త తెలుసుకుని తాను కువైట్ నుంచి సోమవారం పొత్తపికి వచ్చానన్నారు. అంత్యక్రియల అనంతరం బుధవారం మాధవరం-1 గ్రామానికి వచ్చామన్నారు. తమ ఇంటి తాళాలు పగులగొట్టి, లోపల ఉన్న బీరువాను తెరిచి దుస్తులను చిందర వందరగా పడేసి ఉండటాన్ని గమనించామన్నారు. ఇంట్లో ఉన్న 8 తులాల బంగారు, రూ. 30వేల నగదు, ఒక మొబైల్ ఫోన్‌ను అపహరించుకొని వెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ, ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కడప నుంచి క్లూస్‌టీంను రప్పించి దర్యాప్తు చేస్తున్నారు.

రాయచోటిలో అలజడి

- పోలీస్, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఉగ్రవాదుల ఇళ్లలో సోదాలు
- భారీగా పేలుడు పదార్థాల సామగ్రి, సాంకేతిక పరికరాలు, ఉగ్రవాదుల సమాచారం లభ్యం
- ఉగ్రవాదుల గృహాలను సీజ్ చేసిన పోలీసులు
- ఎస్పీ అదుపులో ఉగ్రవాదుల కుటుంబసభ్యులు
- సహకారం అందిస్తున్న వారితో రహస్య విచారణ
- రాయచోటి పట్టణంలో పటిష్టంగా నిఘా



ఉగ్రవాదులు నివసిస్తున్న గృహం ఇదే

రాయచోటి : ఉగ్రవాదుల అరెస్టుతో అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో అలజడి నెలకొంది. కొన్ని దశాబ్దాలుగా ఉగ్రవాదులకు రాయచోటి పట్టణం షెల్టర్ జోన్‌గా ఉండటంపై ఇటు పోలీసులు, అటు ప్రజలలో టెన్షన్ వాతావరణం నెలకొంది. చెన్నై, కర్ణాటక, కేరళ, హైదరాబాద్ రాష్ట్రాలలోని పలు ప్రాంతాలలో చేపట్టిన బాంబు బ్లాస్టింగ్ సంఘటనలలో రాయచోటిలో పట్టుబడిన ఇరువురి పాత్ర ఉందన్న సమాచారంతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. కొన్ని నెలలుగా రాయచోటిలోనే మకాం వేసిన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు ఉగ్రవాదుల జాడ కనిపెట్టడంలో సఫలీకృతులయ్యారు. కాశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదులు జరిపిన ఘోర దుర్ఘటన సమయంలో వీరిద్దరి కదలికలు అధికం కావడంపై ఐబీ అధికారులు అలర్ట్ అయినట్లు సమాచారం. ఐబీ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ప్రత్యేక సిబ్బంది ద్వారా వారిద్దరినీ అదుపులోకి తీసుకొన్నారు. కేరళ ప్రాంతానికి చెందిన వీరిద్దరూ రాయచోటిలో స్థిర నివాసం ఏర్పరచుకొని ఇక్కడి నుంచి ఇతర ఉగ్రవాదులతో సంబంధాలను కొనసాగించినట్లు పోలీసులు గుర్తించారు. ఎవరికీ అనుమానం రానివ్వకుండా 30 ఏళ్లుగా రాయచోటిలో జీవనం సాగించడంపై పట్టణంలో మరి ఎంతమంది ఉగ్రవాదులు ఉన్నారో అన్న భయం పట్టణవాసుల్లో నెలకొంది. పట్టుబడిన ఇద్దరినీ ఐబీ అధికారులు చెన్నైకి తరలించిన అనంతరం జిల్లా ఎస్పీ ప్రత్యేక బృందాలతో రెవెన్యూ అధికారులను కలుపుకొని ఉగ్రవాదుల గృహాలలో సోదాలు చేశారు. విస్తుపోయే ఆధారాలు లభించినట్లు తెలిసింది. పట్టణ పరిధిలోని కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో నివాసం ఉన్న షేక్ అమానుల్లా(55) అలియాస్ అబూ బకర్ సిద్దిక్, మహబూబ్‌బాషావీధిలో నివాసం ఉన్న షేక్ మన్సూర్ (47) అలియాస్ మహమ్మద్‌అలీలు సొంతంగా ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. వీరి గృహాలలో బ్లాస్టింగ్ పరికరాలు, కేబుల్స్, నెట్ వర్క్ సమాచారం చేరవేసే యంత్రాలు, మ్యాపులు, భూముల కొనుగోలుకు సంబంధించిన రికార్డులు తదితర వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 1995లో కోయంబత్తూర్‌లో జరిగిన బాంబు పేలుళ్ల కేసులో ప్రధాన నిందితులుగా ఉన్నారు. అలాగే బీజేపీ దివంగత అగ్రనేత ఎల్‌కె అద్వానీ రథయాత్ర సందర్భంగా విధ్వంస చర్యలకు కుట్రలు చేసినట్లు వారి మీద ఆరోపణలు ఉన్నాయి. అలాగే దేశంలో జరిగిన వివిధ ఉగ్రవాద కార్యకలాపాలలో వీరి ప్రమేయం ఉన్నట్లుగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం.

ఆధారాలు లభ్యం

ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఇరువురి అరెస్టు అనంతరం వారి గృహాల్లో పోలీసులు మంగళవారం నుంచి బుధవారం సాయంత్రం వరకు అణువణువునూ శోధించారు. కీలక సమాచారాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆ రెండు గృహాలను సీజ్ చేశారు.

వివాహాలపై..

ఒకవైపు ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రణాళికలు రచిస్తూనే మరోవైపు ఎవరికి అనుమానం రానివ్వకుండా ఇద్దరు ఉగ్రవాదులు సంసార సాగరంలో కొనసాగారు. అబూబకర్ గాలివీడు మండల పరిధిలో వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమార్తె జన్మించి అనారోగ్యంతో మృతిచెందింది. మహమ్మద్‌అలీ పట్టణంలోని బిరాంసాహెబ్‌వీధికి చెందిన మహిళతో వివాహమైంది. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. వీరి వివాహానికి, ఇతర కార్యకలాపాలకు సహకరించిన వారి వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే తీవ్రవాదుల భార్యలను, వారి బంధువులను అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారణ సాగిస్తున్నట్లు తెలిసింది. వీరితో పాటు వీరికి అన్ని రంగాలలో సహకరిస్తున్న మరో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

నిఘా నీడలో రాయచోటి..

దేశంలోనే వివిధ ప్రాంతాలలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేయడంతో జిల్లా ఎస్పీ రాయచోటిలో నిఘా వ్యవస్థను పటిష్టం చేశారు. పట్టణంలోకి ప్రవేశిస్తున్న వాహనాలతో పాటు, వివిధ అంశాలపై నిఘాను కట్టుదిట్టం చేశారు.

బాలల రక్షణకు సమన్వయంతో పనిచేయాలి

– ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా బాలల సంరక్షణ లో కీలకంగా వ్యవహరించే తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, బాలల సంక్షేమ పోలీసు అధికారులు, ఎంఈఓలు సమన్వయంతో పనిచేయాలని ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో బాలల రక్షణలో భాగస్వాముల పాత్రపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు మానవీయ దృక్పథంతో సేవలు అందించాలన్నారు. బాల్య వివాహాల నిరోధంలో తహసీల్దార్లు సహకరించాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎంపీడీఓల పాత్ర ప్రధానమన్నారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారికి మహిళా శిశు సంక్షేమశాఖ తరుపున శ్రీలక్ష్మి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ తోపాటు పలువురు పోలీసు అధికారులు, ఐసీడీఎస్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

అస్థిర పాలనలో తప్పటడుగు.!



కడపలో టీడీపీ 'ఇంటింటికీ సుపరిపాలన'లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి

- ఎంపిక చేసిన నివాసాల సందర్శన
- 'చూస్తాం..చేస్తాం' ఇదీ నేతల తీరు
- ప్రజల్లోకి వెళ్లాలంటే తమ్ముళ్ల ఇబ్బందులు
- టీడీపీ 'ఇంటింటికీ సుపరిపాలన'లో మొదటి రోజే నైరాశ్యం

కడప రూరల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన ఇంటింటికీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం మొదటి రోజే ఇంటింటికీ సుపరిపాలనలో తొలి అడుగుకు బదులుగా 'అస్థిర పాలనలో తొలి తప్పటడుగు' అనేలా సాగిందనే ఆరోపణలు వినిపించాయి.

పరువు నిలబెట్టుకొనేందుకు తంటాలు...

కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం పథకం, యుతకు ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు సంక్షేమం తదితర పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించేందుకు ఇంటింటికీ సుపరిపాలన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతల నివాసాలను సందర్శించి పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. అదే సందర్భంలో పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకోవాలి. పథకాలు అందలేదని ప్రజలు ప్రశ్నించే అవకాశం ఉందని గ్రహించి, ఆ తలనొప్పి ఎందుకని పార్టీ నేతలు చాలా నియోజక వర్గాల్లో తమకు అనుకూలమైన, ఎంపిక చేసిన నివాసాలను మాత్రమే సందర్శించారు. కొన్ని చోట్ల పింఛన్లు రాలేదు..తల్లికి వందనం డబ్బులు పడలేదు అంటే, ఇళ్లుందా, కారుందా అని అడిగి చూస్తాం..చేస్తాం అంటూ నేతలు చేతులు దులుపుకున్నారు.

ప్రొద్దుటూరులో 1వ వార్డులో పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ సుపరిపాలన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టే పథకాలను చెప్పుకుంటూ వెళ్లారు. మైదుకూరులో రాజీవ్ కాలనీలో ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించారు. బద్వేలు 31వ వార్డు రఘునాథపురంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, పార్టీ సమన్వయకర్త రితీష్‌రెడ్డి పాల్గొన్నారు. ఇక్కడ ప్రజల నుంచి పథకాల అమలు తీరు గురించి తెలుసుకోవడం కంటే పథకాల ప్రచారానికే ప్రాధాన్యత ఇచ్చారు. కడప నగరం 10వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవిరెడ్డి పాల్గొన్నారు. ఇక్కడ డ్రైనేజీ, తాగునీటి సమస్య ఉందని స్థానికులు ఏకరువు పెట్టారు. జమ్మలమడుగులో పార్టీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి వెంకటేశ్వర కాలనీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపిక చేసిన నివాసాలను సందర్శించినట్లుగా తెలిసింది. ఈ కార్యక్రమం పార్టీ శ్రేణులకు అగ్ని పరీక్షగా మారింది. ఇటు ప్రజల్లో..అటు అధిష్టానం వద్ద పరువును నిలబెట్టుకోవడానికి తంటాలు పడుతున్నారని ఆ పార్టీలో చర్చసాగుతోంది.

అమృతానగర్‌లో భూ కబ్జాదారుల హల్‌చల్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ప్రొద్దుటూరు మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ అమృతానగర్‌లో భూ కబ్జాదారులు హల్ చల్ చేస్తున్నారు. బుధవారం అమృతానగర్ ఫేజ్ 2లోని 8వ వీధి చివరలో సుమారు 21 సెంట్ల స్థలంలో ఉన్న కంపచెట్లను జేసీబీ ద్వారా తొలగించి కబ్జాకు పాల్పడ్డారు. ఈ ఆక్రమణలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన సోదరుడు మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి అనుచరుల పేర్లు వినిపిస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే స్వగ్రామమైన కామనూరుకు చెందిన శేఖర్‌రెడ్డి, నక్కలదిన్నె మద్దిలేటిరెడ్డి, కుక్కల సుబ్బారెడ్డిలు ఈ కబ్జాలకు పాల్పడుతున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అమృతానగర్‌లోని మడూరు రోడ్డులో ఉన్న ప్లాట్లు, లోపలి భాగంలో ఉన్న ప్లాట్లు టీడీపీ నాయకులు ఆక్రమించుకుని దౌర్జన్యానికి పాల్పడుతున్నారని పలువురు అమృతానగర్ ప్రజలు వాపోతున్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల ఇళ్ల స్థలాల్లో సుమారు 200 ప్లాట్లు కబ్జా చేసినట్లు ప్రజలు పేర్కొంటున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అమృతానగర్ మొదటి, రెండో, మూడో విడతలకు సంబంధించి 350 ఎకరాల్లోని 80 ఎకరాల నుంచి 100 ఎకరాల వరకు కబ్జాకు గురైందని, వీటికి దొంగ డీఫారాలు పుట్టించారని సమాచారం. రెవెన్యూ అధికారుల ఫోర్జరీ సంతకాలు, నకిలీ సీళ్లతో, భోగస్ అనుబంధ ఫారాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్ విచారణ చేసి పేదల ఇళ్ల స్థలాల ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఏఎఫ్‌యూపై కపట ప్రేమ మానుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీపై కూటమి ప్రభుత్వం కపట ప్రేమ మానుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు అన్నారు. బుధవారం ఏఎఫ్‌యూలో విద్యార్థులతో కలిసి సమస్యలను పరిష్కరించాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020, 21, 22 విద్యా సంవత్సరానికి సంబంధించిన సీఓఏ కౌన్సిల్ అఫ్ ఆర్కిటెక్ పర్మిషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. పది రోజుల్లో విద్యా సంవత్సరం పూర్తి అవుతున్నా ఇంకా పర్మిషన్ లేకపోవడంపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఏప్రిల్‌లో ఇవ్వాల్సిన సెట్ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారన్నారు. దీనిపై విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు చంద్ర, అరుణ్, నగర కార్యదర్శి తేజ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా

– వ్యక్తి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన ప్రభాకర్



బోల్తా పడిన కారు

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలో మండలంలోని శెట్టివారిపల్లె సచివాలయం వద్ద బుధవారం సాయంత్రం కారు బోల్తాపడిన సంఘటనలో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో వ్యక్తి గాయపడ్డాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన గుర్రం ప్రభాకర్(29), తేజేశ్వర్ అనే ఇరువురు వ్యాపార నిమిత్తం ప్రొద్దుటూరుకు వచ్చి తిరిగి తాడిపత్రికి బయలుదేరారు. శెట్టివారిపల్లె వద్ద వేగం అదుపు చేసుకోలేకపోవడంతో కారు పక్కనే వున్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలతో కారులోనే వున్న తేజేశ్వర్‌ను స్థానికులు వచ్చి బయటకు తీశారు. మృతునికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఎర్రగుంట్లలో యువకుడి దారుణ హత్య

- రాళ్లతో కొట్టి చంపిన గుర్తు తెలియని వ్యక్తులు
- మృతుడు కడప మాసాపేటకు చెందిన షేక్షావలీగా గుర్తింపు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ నరేష్‌బాబు

జమ్మలమడుగు(ఎర్రగుంట్ల) : ఎర్రగుంట్ల పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణంలో పాత గోదాముల వద్ద ఓ యువకుడిని దారుణంగా హత్య చేశారు. బుధవారం ఉదయం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ నరేష్‌బాబు సిబ్బందితో వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి ముఖంపై తీవ్ర రక్త గాయాలు ఉండటంతో పాటు పక్కనే రాళ్లు కూడా పడి ఉండటంతో రాళ్లతో కొట్టి దారుణంగా హత్య చేశారని నిర్ధారణకు వచ్చారు. తొలుత గుర్తు తెలియని యువకుడి మృతదేహంగా భావించారు. ఆ తర్వాత ఆరా తీయగా కడప నగరంలోని మాసాపేటకు చెందిన షేక్షావలీ(35)గా గుర్తించారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ..

హత్య జరిగిన విషయాన్ని తెలుసుకున్న జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్లు ఎర్రగుంట్లలోని మార్కెట్ యార్డుకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. సంఘటనపై ఆరా తీశారు. హత్యకు దారి తీసిన కారణాలు, నిందితుల వివరాలు తెలుసుకుని సాధ్యమైనంత త్వరగా హత్యకేసు మిస్టరీని ఛేదించాలని సీఐకు సూచించారు. అనంతరం కడప నుంచి క్లూస్‌టీంతో పాటు, డాగ్ స్క్వాడ్‌ను తీసుకువచ్చి పరిశీలన చేయించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి వీలైనంత త్వరగా నిందితులను అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

రుత్విక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి





రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహిస్తున్న మృతుని బంధువులు (ఇన్‌సెట్) మృతి చెందిన జయరామిరెడ్డి

బి.కోడూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని సర్వాయపల్లె వద్ద గత ఆదివారం కంపెనీ యజమానుల నిర్లక్ష్యం కారణంగా బైక్‌ను రుత్విక్ కంపెనీ టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుంత జయరామిరెడ్డి, కొండా జయరామిరెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమించడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించగా మంగళవారం గుంత జయరామిరెడ్డి మృతి చెందాడు. కొండా జయరామిరెడ్డి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో మృతి చెందిన జయరామిరెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు ప్రజాప్రతినిధులతో కలిసి బి.మఠం మండలంలోని డి.అగ్రహారం వద్ద గల రుత్విక్ కంపెనీ క్యాంపు కార్యాలయం సమీపంలోని నేషనల్ హైవేపై బుధవారం సాయంత్రం మృతదేహంతో ధర్నాకు దిగారు. అంతేకాకుండా రుత్విక్ కన్‌స్ట్రక్షన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు సుమారు బద్వేలు, మైదుకూరు ప్రాంతాలకు చెందిన పదిమందికిపైగా మృత్యువాతపడ్డారని వారు ఆందోళన నిర్వహించారు. రాత్రి 8 గంటల వరకు ధర్నా నిర్వహించినప్పటికీ కంపెనీ వారు స్పందించలేదు. దీంతో ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. బద్వేలు అర్బన్ సీఐ, మైదుకూరు సీఐ, బి.మఠం ఎస్‌ఐలు రంగంలోకి దిగి మృతుని బంధువులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో కంపెనీ యాజమాన్యంతో ఫోన్‌లో చర్చించారు. మృతుడు జయరామిరెడ్డి, తీవ్రంగా గాయపడిన జయరామిరెడ్డిలకు కలిపి కేవలం రూ.12 లక్షలు నష్టపరిహారం ఇస్తామని తెలిపినప్పటికీ మృతుని బంధువులు ఒప్పుకోలేదు. మృతునికి భార్య రమాదేవి, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఆ కుటుంబాన్ని పోషించే నాథుడు కరువవడంతో కంపెనీ వారు ముందుకు వచ్చి వారిని ఆదుకుని కుటుంబానికి తగిన న్యాయం చేయాలని స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు కోరారు.

విశ్వేశ్వర్‌రెడ్డి సేవలు విలువైనవి

– ఏపీ ట్రాన్స్‌కో సీఈ క్రిష్ణ కుమార్



ఎస్ఈ విశ్వేశ్వర్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఏపీ ట్రాన్స్ కో ఉద్యోగులు

కడప కార్పొరేషన్ : ఏపీ ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్(సివిల్) చెవ్వా విశ్వేశ్వర్‌రెడ్డి సేవలు ఎంతో విలువైనవని చీఫ్ ఇంజినీర్ క్రిష్ణ కుమార్ అన్నారు. బుధవారం హెచ్ఎస్ ఫంక్షన్ హాలులో ఆయన ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన క్రిష్ణ కుమార్ మాట్లాడుతూ 1989లో విద్యుత్ సంస్థలో చేరిన విశ్వేశ్వర్‌రెడ్డి వృత్తినే దైవంగా భావించి, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశారన్నారు. ఏ హోదాలో పనిచేసినా దానికి గౌరవం తెచ్చారని తెలిపారు. అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు సీఎస్ఆర్ మూర్తి, శ్రీనివాసరావు, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, రిటైర్డ్ సీఈ క్రిష్ణమనాయుడు, బీసీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీకే వీరభద్రయ్య పాల్గొన్నారు.


పెంచిన వేతనాలు ఇవ్వాలి




కార్మికశాఖ అధికారితో చర్చిస్తున్న రిమ్స్ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రిమ్స్ మెడికల్ కళాశాలలో దినసరి వేతనం కింద పనిచేస్తున్న వారికి పెంచిన వేతనాలను ఇవ్వాలని జిల్లా కార్మికశాఖ అధికారి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్కిల్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కార్మికులుగా నిర్ణయించిన మేరకు వేతనాలను ఇవ్వాలని సూపర్‌వైజర్ ఎస్వీ సాయికృష్ణారెడ్డిని ఆదేశించారు.


డ్రాగా ముగిసిన కడప– నెల్లూరు మ్యాచ్




కారుణ్య ప్రసాద్, నెల్లూరు (103 పరుగులు)



షాహుల్ హుస్సేన్ నెల్లూరు, (80 పరుగులు)



రోహిత్, నెల్లూరు (73 పరుగులు)



ఆర్థిత్ రెడ్డి, కడప (4 వికెట్లు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ -19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 232 పరుగులు చేసింది. కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 303 పరుగులు చేసింది. ఒక వికెట్ నష్టానికి 144 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 114.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 419 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని కారుణ్య ప్రసాద్ అద్భుతంగా బ్యాటింగ్‌లో రాణించి 103 పరుగులు (సెంచరీ) చేశాడు. సయ్యద్ షాహుల్ హుస్సేన్ 80 పరుగులు, రోహిత్ 73 పరుగులు చేశారు. కడప జట్టులోని ఆర్థిత్ రెడ్డి 4, చరణ్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 13.0 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు ఆధిక్యత సాధించింది.